క్లుప్తంగా

చేప పిల్లల విడుదల



మద్నూర్(జుక్కల్): మేనూర్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గోవింద్ ఆధ్వర్యంలో ఊర చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. గ్రామ శివారులోని చెరువులో 58 వేల చేప పిల్లలను విడుదల చేశామని వారు తెలిపారు. కో–ఆప్షన్ సభ్యుడు నిజాముద్దీన్, శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్, రామారావ్, గంగాధర్, గంగపుత్రులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ కాపీల పంపిణీ

పిట్లం(జుక్కల్): కారేగావ్‌లో మంగళవారం గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను సర్పంచ్ దుర్గయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గృహ లక్ష్మి పథకంలో భాగంగా ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున 20 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు వివరించారు. ఉప సర్పంచ్ గంగారెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బైక్ ర్యాలీ

భిక్కనూరు: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఎం గతంలో ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ విప్ పర్యటన విజయవంతం చేయాలి

దోమకొండ: మండల కేంద్రంలో బుధవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పర్యటన ఉంటుందని, విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంధ్ర మధుసూదన్ రావ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయని తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, ఎంపీటీసీ కడారి రమేష్ ఉన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఈ నెలాఖరులోగా గ్రామంలో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. గోలిలింగాల గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మహేశ్ గౌడ్ ఉన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

కామారెడ్డి అర్బన్: గ్రామాభివృద్ధికి ప్రధాన వనరుగా ఉండే ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని కామారెడ్డి మండల పంచాయతీ అధికారి మలహరి అన్నారు. మంగళవారం చిన్నమల్లారెడ్డిలో ఇంటింటికి తిరిగి పన్నుల వసూలు కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ గ్రామ స్టేజి వద్ద గల మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం భారత జాగృతి ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు చిట్టిమల్ల అనంత రాములు, మహిళా అధ్యక్షురాలు బట్టు పద్మజ మాట్లాడుతూ... చట్ట సభల్లో రిజర్వేషన్ బిల్లు ఆమోదం వల్ల కలిగే ప్రయోజనాలు, మహిళల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతినిధులు వెంకటేశ్, చక్రధర్, సత్యనారాయణ, ప్రిన్సిపాల్ రాధిక పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నిజాంసాగర్(జుక్కల్): సైబర్ నేరాలపై తల్లిదండ్రులను మరింత అప్రమత్తం చేయాలని స్థానిక ఎస్సై రాజశేఖర్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు బీసీ బాలుర వసతి గృహ విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం వెంకటేశం పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చులు పెట్టడం మానుకోవాలి

బాన్సువాడ: కులాల మధ్య రాజకీయ పార్టీలు చిచ్చుపెడుతున్నాయని, ఇటువంటి ప్రయత్నాలను తిప్పికొట్టాలని మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కొట్టం గంగాధర్ అన్నారు. మంగళవారం ఆయన సంఘం భవనంలో కులస్తులతో కలిసి మాట్లాడారు. మండలంలోని మున్నూరు కాపులకు సమాచారం ఇవ్వకుండా కొత్త కమిటీ వేసుకున్నారని ఆరోపించారు. మున్నూరుకాపు కులస్తులు ఏ పార్టీకి ఏకగ్రీవ తీర్మానాలు ఇచ్చిన సాంప్రదాయం లేదని, కొత్త సాంప్రదాయాలకు తెరలేపి అంతర్గత కలహాలు సృష్టించవద్దన్నారు. సిద్ధిభూమయ్య, పత్తికాశీరాం, గోపానినర్సయ్య, తోట శ్రీనివాస్, తదతరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

కనీసం వేతనం రూ.18 వేలు చెల్లించాలని జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్లు సమ్మెకు దిగారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, హెల్త్‌కార్డులు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమా రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని కోరారు. ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం పోస్టుల్లో ప్రమోషన్లు కల్పించాలని, క్వాలిటీ యూనిఫామ్‌లు అందజేయాలని కోరారు. పెండింగ్ బకాయిలు విడుదల చేసి సంక్షేమ పథకాలన్నింటినీ ఆశావర్కర్లకు అందించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



నాగిరెడ్డిపేటలో అంబేద్కర్ విగ్రహానికి వినతి..



దోమకొండలో ..



పిట్లంలో ..



సదాశివనగర్‌లో ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు



మద్నూర్‌లో..



బాన్సువాడలో నిరసన వ్యక్తం చేస్తూ..

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

నిజాంసాగర్(జుక్కల్): సీఎం కేసీఆర్‌తోనే గిరిజన తండాలు, గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అన్నారు. మంగళవారం ముగ్దుంపూర్, గాలిపూర్, బూర్గుల్, గున్కుల్ గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, కొత్త బ్రిడ్జిల నిర్మాణానికి భూమిపూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో 60 ఏళ్ల అభివృద్ధి జరిగిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, గైని విఠల్, వాజిద్‌అలీ, నర్సింహారెడ్డి, మనోహర్, లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, తదితరులు ఉన్నారు.



గాలిపూర్‌లో వంతెన నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ దఫేదార్ శోభ

ఐదు గ్రామాల్లో ‘మేరీ మాటీ మేరా దేశ్’

మాచారెడ్డి: మండలంలోని ఎల్లంపేట, ఒడ్డెగూడెం, నెమలిగుట్ట తండా, సోమారంపేట, రత్నగిరిపల్లి గ్రామాల్లో మంగళవారం బీజేపీ చేపట్టిన మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడారు. అమరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయడానికే స్మృతివనం నిర్మిస్తున్నారని, దాని కోసం ఊరూరా తిరిగి మట్టి సేకరిస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములై మట్టిని అందజేయాలని కోరారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ పండ్ల ప్రవీన్, బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహాచారి, మండల ప్రధాన కార్యదర్శి సురేశ్ ఉన్నారు.



సోమారంపేటలో మట్టిని సేకరిస్తున్న బీజేపీ నేతలు

కొత్త ప్రధానోపాధ్యాయులపై బాధ్యత పెరిగింది

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి

కామారెడ్డి అర్బన్: కొత్తగా గెజిటెడ్ హోదా పొందిన ప్రధానోపాధ్యాయులకు మరింత బాధ్యత పెరిగిందని, పాఠశాలల్లో ఉత్తమంగా బోధించడానికి కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి కోరారు. పీఆర్‌టీయూ కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సాందీపని కళాశాలలో గెజిటెడ్ హోదా పొంది తెలంగాణలోని ఖమ్మం, మెదక్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలకు బదిలీ అయిన, ఇతర జిల్లాల నుంచి కామారెడ్డి జిల్లాకు వచ్చిన ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి వారిని ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పి.దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుషాల్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు మధుసూదన్‌రెడ్డి, పోచయ్య, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ

అన్నదానాలు.. శోభాయాత్రలు.. నిమజ్జనం



భూంపల్లిలో గణేశ్ శోభాయాత్ర

జిల్లా వ్యాప్తంగా గణేశ్ మండపాల వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. శోభాయాత్ర సందర్భంగా యువకుల నృత్యాలు అలరించాయి. నిమజ్జన కార్యక్రమానికి ముందు లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. ఎల్లారెడ్డి మండలం దావల్‌మల్కపల్లిలో బిట్ల పోచయ్య రూ.68 వేలకు, దేవునిపల్లిలో నాగం సురేష్ రూ.31 వేల లడ్డూలను వేలంలో దక్కించుకున్నారు. మద్నూర్ మండల కేంద్రంలోని శేథ్‌కారి గణేష్ మండలి లడ్డూను స్థానికుడు అవార్‌వార్ హన్మండ్లు రూ.28,888కి దక్కించుకున్నాడని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. రామారెడ్డిలో నవ యువ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి చేతిలోని లడ్డును వినూత్నంగా లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. లడ్డూ కోసం రూ.10 టోకెన్లు విడుదల చేశారు. అవి కొన్న వారిలో అన్నారం గ్రామానికి చెందిన గడ్డం అరవింద్‌కు లడ్డూ దక్కింది. అంతకు ముందు అన్నదానాలు నిర్వహించారు. శోభాయాత్ర అనంతరం చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. రామారెడ్డిలో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ఏర్పాట్లను స్థానిక తహసీల్దార్ రోజా పర్యవేక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



లడ్డూను దక్కించుకున్న బిట్ల పోచయ్య



నాగం సురేష్(దేవునిపల్లి)



సదాశివనగర్‌లో పూజలందుకుంటున్న గణేశుడు



సజ్జన్‌పల్లిలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



గాంధారిలో..



మద్నూర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు

ఐలమ్మను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి



డీపీవోలో నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి



అదనపు కలెక్టర్ చంద్రమోహన్

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మహిళా చైతన్యానికి ప్రతీక నిలిచిన చాకలి ఐలమ్మ జయంతిని మంగళవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, రజక సంఘాల ఆధ్వర్యంలో ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన పోరాటాన్ని వక్తలు కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు నడవాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



బాన్సువాడలో నివాళులర్పిస్తున్న అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



బూర్గుల్‌లో .. జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ



ఎల్లారెడ్డిలో.. మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ



నాగిరెడ్డిపేటలో .. ఎంపీపీ, ఎంపీడీవో



నర్వలో.. రజకులు

‘పరీక్షల రద్దు ప్రభుత్వ వైఫల్యమే’



భిక్కనూరు: గ్రూప్–1 పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించలేకపోవడం ప్రభుత్వ చేతగానితనమేనని పేర్కొంటూ మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంజయ్, ప్రతినిధులు రాజేశ్, వెంకటేశ్, నర్సింలు, సమీర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని గడి కాలనీలో సీసీ రోడ్డు పనులను మంగళవారం జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సర్పంచ్ జొన్న విజయారెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, జంబిగే హన్మాండ్లు, రవి, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

- **దరఖాస్తుల ఆహ్వానం**

ఎల్లారెడ్డి: పట్టణంలోని మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలలో పార్ట్ టైం అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మసూద్ అహ్మద్ మంగళవారం తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో బీఎడ్ పూర్తి చేసి, టీచింగ్‌లో మూడేళ్ల అనుభవం ఉన్న వారు ఎల్లారెడ్డి పట్టణంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో ఈనెల 30లోగా దరఖాస్తులను అందించాలని అన్నారు.

- **నేడు బాన్సువాడలో మెగా జాబ్ మేళా**

బాన్సువాడ: పట్టణంలోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం పీబీఆర్ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ, నర్సింగ్, అగ్రికల్చర్ డిప్లొమా, తదితర కోర్సులు చేసిన వారు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చునని అన్నారు.

సుభాష్‌రెడ్డి గెలవాలని పాదయాత్ర

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి రానున్న ఎన్నికలలో గెలుపొందాలని కోరుతూ కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం పాదయాత్ర చేపట్టారు. అడివిలింగాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మన్నె కిష్టయ్య, బేస్త సంగయ్యలు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి నసురుల్లాబాద్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గల తెలంగాణ తిరుపతి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎం కావాలని, షబ్బీర్ అలీ మంత్రి, సుభాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందాలని వారు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు.

విజేతలకు బహుమతులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల విజేతలకు మంగళవారం నగదు పారితోషకం, మెమొంటోలను అందజేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారిణి శిరీష చేతుల మీదుగా బహుమతులను అందించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



నాగిరెడ్డిపేటలో గర్భిణులు, చిన్నపిల్లలతో కలిసి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు



గాంధారిలో..

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలో అంగన్‌వాడీ సిబ్బంది చేపడుతున్న సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులతో కలిసి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వం మొండి వైఖరి వీడి వెంటనే తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. బీబీపేటలో వంటావార్పు నిర్వహించారు. పిట్లంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బొల్ల రాజు సమ్మెకు మద్దతు తెలిపి వారితో కలిసి సమ్మెలో పాల్గొన్నారు. సమ్మెకు చేస్తున్న అంగన్వాడీ టీచర్లకు ఆర్థిక సహాయం అందజేశారు. పలువురు వారికి మద్దతు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



నస్రుల్లాబాద్‌లో



బీర్కూర్‌లో..

సంక్షిప్తం

చెట్ల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

రాజంపేట: ఫీల్డ్ అసిస్టెంట్లు మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపాలని ఎంపీడీవో బాలకిషన్ సూచించారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతులకు కొబ్బరి, మామిడి, మునగ తోటల పెంపకంపై సబ్సిడీతో కూడిన పథకానికి రైతులను ఎంపిక చేయడంపై చర్చించారు.

రైతులందరి రుణాలు మాఫీ చేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్యాంకుల్లో తీసుకున్న అందరి రైతుల రుణాలను మాఫీ చేయాలని సింగిల్ విండో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తాడ్వాయి సింగిల్ విండో కార్యాలయంలో మంగళ వారం సింగిల్ విండో సంఘం ఇన్‌చార్జి అధ్యక్షుడు ఆకిటి ధర్మారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు విషయాలపై చర్చించి తీర్మానించారు. డైరెక్టర్లు శ్యాంరావు, నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

విండో అభివృద్ధికి కృషి చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతులు విండో అభివృద్ధికి కృషి చేయాలని పద్మాజీవాడి విండో చైర్మన్ గంగాధర్ కోరారు. మంగళవారం పద్మాజీవాడి సింగిల్ విండో ఆధ్వర్యంలో రైతు వేదిక భవనంలో విండో మహాజన సభ నిర్వహించారు. విండో సీఈవో దేవేందర్, సర్పంచ్ కవిత ఆనంద్, విండో వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులున్నారు.

చలో హైదరాబాద్ జయప్రదం చేయాలి

కామారెడ్డి టౌన్: పంచాయితీ కార్మికుల డిమాండ్‌ల సాధన కోసం అక్టోబర్ 5న నిర్వహించిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేతలు బాలనర్సు, రాజన్న పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వినతి

దోమకొండ: తెలంగాణ పోరాటయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు దోమకొండలో స్థలం కేటాయించాలని మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ సర్పంచ్ నల్లపు అంజలికి వినతి పత్రం అందజేశారు. పద్మశాలి సంఘం ప్రతినిధులు మేక నాగరాజు, బొమ్మెర గంగాధర్, తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా శ్రీకాంత్

దోమకొండ: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా దోమకొండకు చెందిన శ్రీకాంత్‌ను మాజీ మంత్రి షబ్బీర్ అలీ నియమించారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాంత్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అనంతరెడ్డి ఉన్నారు.

రేణుకా మాత ఆలయానికి విరాళం

దోమకొండ: మండల కేంద్రంలోని రేణుకా మాత ఆలయంలోని అమ్మవారికి పంచతల నాగపడిగె ఏర్పాటుకు మంగళవారం రేణుకా మాత వైన్స్ యాజమానులు పున్న లక్ష్మణ్, రాఘవపల్లి ప్రసాద్‌గౌడ్‌లు రూ.11,116 విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భూషణం గౌడ్ పాల్గొన్నారు.

ఈ–పంచాయతీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

రాజంపేట: పంచాయతీ రాజ్ శాఖ టెక్నికల్ వ్యవస్థలో 13 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. పేస్కేలు, జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.